యాదగిరిగుట్టలో వైభవంగా లక్షపుష్పార్చన

స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబర్ 26 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. మంగళవారం స్వయంభూ ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. స్వామి, అమ్మవార్లకు సహస్రనామ పఠనాలతో వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలను పాంచరాత్రాగమశాస్త్రం ప్రకారం కొనసాగించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు సహస్రనామార్చన నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణపుష్పార్చన జరిపించారు. సాయంత్రం స్వామివారికి దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, సహస్రనామార్చన, శయనోత్సవ సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా తెల్లవారుజాము నుంచే మహిళలు దీపారాధనలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రతమాచరించారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామికి ఆకుపూజ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 20వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.31,06,451 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

రాజ్యాంగ ఫలాలు అందరికీ సమానంగా అందాలి

- రామన్నపేట జూనియర్ ప్రిన్సిపల్ కోర్టు జడ్జి శిరీష

భువనగిరి కలెక్టరేట్ : కలెక్టర్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

రామన్నపేట : కోర్టు ఆవరణలో ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్జి శిరీష

రామన్నపేట, నవంబర్ 26 : రాజ్యాంగ ఫలాలు అందరికీ సమానంగా అందాలని రామన్నపేట జూనియర్ ప్రిన్సిపల్ కోర్టు జడ్జి శిరీష అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉయ్యాల హన్మంతుగౌడ్, బాసరాజు అశోక్‌కుమార్, మామిడి వెంకట్‌రెడ్డి, యాదాసు యాదయ్య పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవం

భువనగిరి కలెక్టరేట్ : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో జిల్లా అధికారులు, సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో పుట్టిన ప్రజలందరూ దేశ సార్వభౌమ్య, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం నెలకొల్పేందుకు అహర్నిశలు పాటుపడాలన్నారు. పౌరులందరికీ సామాజిక, ఆర్థిక రాజకీయ, న్యాయం, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధన, స్వాతంత్ర్యం, వ్యక్తి గౌరవం, జాతి ఐక్యత, అఖండతను కాపాడేందుకు అంకిత భావంతో కృషి చేస్తామని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. వివిధ శాఖల అధికారులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలోని వలిగొండ రోడ్డు సమీపంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ రూపకల్పనలో ఆయన దూరదృష్టిని పలువురు గుర్తు చేశారు. సీఐ మన్మథకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ రాములునాయక్, సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తుర్కపల్లి : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని రాంపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి, ఉపాధ్యాయులు మహేశ్, నవీన్, రోజారమణి, సత్యసిద్ధార్థ, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

బీబీనగర్ : మండలంలోని రాఘవాపురం గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక మహిళా డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.నిరూప, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీలత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పావని, స్రవంతి, ప్రతిభ, విద్యార్థులు పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ఉపాధ్యాయులు సిరికొండ నర్సింహారావు, అచ్చయ్య, రాధారాణి, సోమిరెడ్డి, బ్రహ్మాచారి, అనిత, రమాదేవి పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలోని గాయత్రి పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తొర్రూరు చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు నివాళి అర్పించారు.

యాదగిరిగుట్ట : పట్టణంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం, నవభారత్ యూత్ అసోసియేషన్, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజయనేయులు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శిక్షణ కేంద్రంలోని విద్యార్థులకు సమాజ అవగాహనపై పరీక్ష నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

తుర్కపల్లి : రాంపురం ఆదర్శ పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు(ఎం) : మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, అధికారులు, ఉద్యోగులు

బీబీనగర్ : సాంఘిక సంక్షేమ సైనిక్ మహిళా డిగ్రీ కాలేజీలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ నిరూప, అధ్యాపకులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

వలిగొండ : టేకులసోమారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

వలిగొండ, నవంబర్ 26 : విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి పాఠశాల నిర్వాహకులకు సూచించారు. మండలంలోని టేకులసోమారం గ్రామ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం అందిస్తున్నారా.. నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయలు, వంట సామగ్రిని శుభ్రం చేసి పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేయాలని, వంటశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికులకు, పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం భువనగిరి నియోజకవర్గంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు రెడ్లరేపాక గ్రామ పరిధిలోని మనియండ్లగుట్ట వద్ద స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐ మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్ సందర్శన

మోత్కూరు : పట్టణంలోని బీసీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని బియ్యం, వంటలను పరిశీలించారు. బియ్యంలో పురుగులు లేకుండా శుభ్రం చేసి రెండు, మూడుసార్లు నీటితో కడుగాలన్నారు. కూరగాయలను కడుగాలని వంట మనుషులకు సూచించారు.

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను సమర్థవంతంగా చేపట్టాలి

- డీఈఓ సత్యనారాయణ

శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 26 : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను సమర్థవంతంగా, పారదర్శకతతో చేపట్టాలని జిల్లా విద్యా శాఖ అధికారి కె.సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని వెన్నెల కళాశాలలో ఫీల్డ్ ఇన్‌స్ట్రక్టర్లకు మంగళవారం నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2024ను ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాండు, శ్రీనివాస్, జానీ, నర్సింహాచారి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరిశుభ్ర ఆహారం అందించాలి : ఆర్డీఓ

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

రాజాపేట, నవంబర్ 26 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. తాసీల్దార్ దామోదర్, ఆర్‌ఐ రమేశ్, ప్రధానోపాధ్యాయురాలు జయంత ఉన్నారు.

ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు విక్రయించాలి : ఏడీఏ

కొలనుపాకలో ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ పద్మావతి

ఆలేరు రూరల్, నవంబర్ 26 : ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలను విక్రయించాలని ఏడీఏ పద్మావతి అన్నారు. మండలంలోని కొలనుపాకలో ఎరువుల దుకాణాన్ని మంగళవారం తనిఖీ చేసి మాట్లాడారు. రోజూ తప్పకుండా స్టాక్ బోర్డు రాయాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేశాక బిల్లు రసీదు తప్పకుండా తీసుకోవాలన్నారు. వాటిని పంట కాలం పూర్తయ్యేవరకు భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు.

ఆమె వెంట ఏఓ శ్రీనివాస్, ఏఈఓ శివకుమార్ ఉన్నారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 26 : ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజనం కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మంచాల మధు అన్నారు. బకాయి బిల్లులను చెల్లించాలని కోరుతూ మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో శ్యామలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వంట కోసం నిత్యం కూరగాయలు, వంట సామగ్రికి అప్పులు తెచ్చి ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రమౌళి, మధ్యాహ్న భోజన కార్మికులు అంజమ్మ, సాలమ్మ, లక్ష్మి, కవిత, లలిత, జయమ్మ, వెంకటమ్మ, యాదమ్మ, రమాదేవి, వసంత పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఆత్మకూరు(ఎం), నవంబర్ 26 : మండలంలోని కూరెళ్లలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారుపాక వీరయ్య మృతిచెందడంతో మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మారుపాక ఉప్పలయ్య (75) రోడ్డు పక్కన నిలుచున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం భువనగిరికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

తుర్కపల్లి, నవంబర్ 26 : మండలంలోని మాదాపురం గ్రామంలో సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారోజు ఉమ (28) ఇంటి ఆవరణలో ఉన్న నీటిసంపు వద్ద గల మోటర్‌ను వేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. మృతురాలికి ఒక కొడుకు ఉన్నారు.

పోలీసులమని నమ్మించి నగల అపహరణ

ఆలేరు టౌన్, నవంబర్ 26 : నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని ఇద్దరు యువకులు పోలీసులమని నమ్మించి నగలు దోచుకుపోయిన సంఘటన ఆలేరులో మంగళవారం జరిగింది. బాధితుడి వివరాల ప్రకారం.. మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన వృద్ధుడు పులిగిల్ల బాలరాజు మంగళవారం మధ్యాహ్నం 2:30గంటల సమయంలో హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులో వచ్చి ఆలేరు బస్‌స్టేషన్‌లో దిగాడు. స్థానిక రైల్వేస్టేషన్ పార్కింగ్‌లో తన ద్విచక్ర వాహనాన్ని తీసుకునేందుకు రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతన్ని అనుసరిస్తూ బైక్‌పై వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు బాలరాజును ఆపి తాము పోలీసులమని నమ్మించారు. ఆలేరులో దొంగలు పడుతున్నారు.. ఒంటిపై ఉన్న నగలు తీసి జాగ్రత్తగా పెట్టుకోమని చెప్పారు. వారి మాటలు నమ్మిన బాలరాజు మెడకు ఉన్న తులంన్నర బంగారం చైన్, చేతివేళ్లకు ఉన్న రెండు ఉంగరాలను తీశాడు. వాటిని ఆ ఇద్దరు యువకులు ఒక పేపర్‌లో పెట్టి పొట్లంగా కట్టారు. కానీ.. అతనికి చిన్న రాళ్లతో ఉన్న మరొక పొట్లం ఇచ్చి వెళ్లిపోయారు. బాలరాజు కొద్దిసేపటికే పొట్లాన్ని విప్పిచూడగా రాళ్లు కనిపించడంతో మోసపోయినట్లు గ్రహించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రజనీకర్ తెలిపారు.

గోవుల వాహనం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 26 : మండలంలోని ఎల్లంబావి గ్రామ స్టేజీ వద్ద గోవులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని, డ్రైవర్‌ను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన 11 మూగజీవాలను హైదరాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డిసెంబర్ 1న కబడ్డీ మహిళా జిల్లా జట్ల ఎంపిక

ఆలేరు టౌన్, నవంబర్ 26 : కబడ్డీ మహిళా జిల్లా జట్ల ఎంపికను డిసెంబర్ 1న నిర్వహిస్తున్నట్లు ఆలేరు ఫిజికల్ డైరెక్టర్ పూల నాగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలేరులోని ఫ్రెండ్స్ క్లబ్ ఆవరణలో జిల్లా 71వ మహిళా కబడ్డీ జట్ల ఎంపిక డిసెంబర్ 1న ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. క్రీడాకారులు 75కిలోల లోపు బరువు ఉండాలని, ఆసక్తిగల విద్యార్థినులు ఆధార్ కార్డు తీసుకొని రావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 7నుంచి 10వరకు ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నమస్తే తెలంగాణ విలేకరి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

విలేకరి శ్రీహరి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి

బొమ్మలరామారం, నవంబర్ 26 : నమస్తే తెలంగాణ స్థానిక విలేకరి ఎల్లబోయిన శ్రీహరి తండ్రి రిటైర్డ్ టీచర్ అంజనేయస్వామి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో శ్రీహరి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకుడు పోలగాని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'కార్మిక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'

ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

భువనగిరి అర్బన్, నవంబర్ 26 : కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీకి పాలించే హక్కు లేదని, కార్మిక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అఖిల భారత రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య అన్నారు. కార్మిక సంఘాల ఐక్య వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మోదీ విధానాలకు నిరసనగా పట్టణంలోని రైల్వే స్టేషన్ నుంచి బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు చట్టాలను రద్దు చేస్తామని పార్లమెంట్‌లో చెప్పిన మోదీ.. నేటికీ అమలు చేయలేదన్నారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నూతన లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారని తెలిపారు. కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సుడుగు జీవన్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, సీఐటీయూ జిల్లా నాయకులు కల్లూరి మల్లేశం, బాలరాజు, మాధవరెడ్డి, ఏశాల అశోక్ పాల్గొన్నారు.

వచ్చే నెల 10వరకు స్త్రీలపై హింసా నివారణ పక్షోత్సవాలు

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, సార్ప్ సిబ్బంది

భువనగిరి అర్బన్, నవంబర్ 26 : స్త్రీలపై జరిగే హింసకు వ్యతిరేకంగా నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు పక్షోత్సవాలు జరుగుతున్నాయని సార్ప్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ప్రమీల అన్నారు. పక్షోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వినాయక చౌరస్తాలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గృహహింస నిరోధక కమిటీలు, సమావేశాలు, పాటలు, ఆటల ద్వారా మహిళలపై జరిగే హింసను వ్యతిరేకిస్తూ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు సుదర్శన్, బి.జహంగీర్, రామచంద్రయ్య, శివలింగం, సైదులు పాల్గొన్నారు.

'సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

చౌటుప్పల్, నవంబర్ 26 : చౌటుప్పల్‌లో డిసెంబర్ 15, 16, 17 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో చిన్న నీటి వనరుల కాల్వలు, బస్వాపురం, గంధమల్ల, శివన్నగూడెం ప్రాజెక్టుల పూర్తి కోసం ఉద్యమాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, నాయకులు గంగాదేవి సైదులు, బూర్గు కృష్ణారెడ్డి, బండారు నర్సింహ, ఎండీ పాషా, గోశిక కరుణాకర్, సంజీవరెడ్డి, మోహన్, కృష్ణయ్య, లక్ష్మణ్, అరుణ్‌కుమార్, రమేశ్, మధుకృష్ణ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

బొమ్మలరామారం, నవంబర్ 26 : టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శివనారాయణ, ఉపాధ్యక్షుడిగా సేవ, మహిళా ఉపాధ్యక్షురాలిగా జయలక్ష్మి, కోశాధికారిగా బాలరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికకు సహకరించిన సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, కోశాధికారి ఇటికాల మల్లేశం, జిల్లా ఆడిట్ కన్వీనర్ రమణారావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

తుర్కపల్లి : ఇందిరానగర్‌లో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

తుర్కపల్లి, నవంబర్ 26 : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని ఇందిరానగర్‌లో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం పెద్దతండాలో దుర్గమ్మ, ఎల్లమ్మ పండుల్లో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యామహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చాడ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండల కేంద్రంలో రూ.11.40 కోట్లతో నిర్మించే బీటీ, సీసీ రోడ్లను ప్రభుత్వ విప్ ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి పల్లెలు పట్టుగొమ్మల్లాంటివి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు : డి.రేపాకలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు/ అడ్డగూడూరు, నవంబర్ 26 : రాష్ట్ర అభివృద్ధిలో పల్లెలు పట్టుగొమ్మల్లాంటివని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మోత్కూరు మండలంలోని పాటిమట్లలో గ్రామపంచాయతీ భవనం, అడ్డగూడూరు మండలంలోని డి.రేపాక గ్రామంలో గ్రామపంచాయతీ భవనం, సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డగూడూరు మండలం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని మోత్కూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ హక్కుల ఫలితంగానే దేశంలోని ప్రజలందరికీ సముచిత ప్రాధాన్యం దక్కిందన్నారు. కార్యక్రమాల్లో పీఆర్ డీఈ మంగులాల్, అడిషనల్ డీఆర్‌డీఓ సురేశ్, పీఆర్ ఏఈ మల్లేశం, మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, వైస్ చైర్మన్ వెంకటయ్య, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారులు కృష్ణ, యాదయ్య, తాసీల్దార్లు శేషగిరిరావు, రాంప్రసాద్, ఎంపీడీఓలు శంకరయ్య, బాలాజీ, సింగిల్‌విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చేడె చంద్రయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్న గ్రామాలు

- భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

జైనపల్లి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి

బీబీనగర్, నవంబర్ 26 : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చిన్నరావులపల్లి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు గోరుకంటి బాలచందర్ కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణగౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గోలి పింగళ్‌రెడ్డి, నాయకులు శ్యామ్‌గౌడ్, శ్యామ్, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, కొండల్‌రెడ్డి, ఆగమయ్యగౌడ్, సందిగారి బసవయ్య, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, నవంబర్ 26 : పట్టణంలోని 11వ వార్డులో మార్కండేయ గుడి ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. పలు వార్డుల్లో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు, నాయకులు గోశిక నర్సింహ, భావనారుషి, వినయ్‌కుమార్, రవి, పురుషోత్తం, భాస్కర్, ప్రభాకర్, కర్నాటి శ్రీశైలం పాల్గొన్నారు.